## 28

## సయోధ్య రాముడేడి?

మనిషికి పుట్టగతులు లేకుండా పొయ్యాయి.

బతుకుదెరువు కోసం ఏదో ఒకటి చెయ్యక తప్పదు. ఊరు చూద్దామా నిశ్చలంగా ఉంది. ఎవడి పని వాడు చేసుకుంటున్నాడు. ఎవడి తిండి వాడు పండించుకుంటున్నాడు. పనిలోంచి, శ్రమలోంచి జీవితపు విలువలు తెలుసుకుంటున్నాడు.

ఊరు అలలేని సరస్సులా ఉంది.

బాధ్యతతో బరువెక్కిన శిరస్సులా ఉంది-

అంతా బాగానే ఉంది. అందరికీ బాగానే ఉంది. మనిషికి మాత్రమే బాగులేదు. కడుపుతో వాడి ఆకలి తీరదు. వాడి ఆకలివేరు. వాడవాడలా చిచ్చు రగిల్చాడు. ఊరిని ముక్కలు ముక్కలుగా చెయ్యాలనుకున్నాడు. వాడల మధ్య, గోడల మధ్య ద్వేషాలు పెంచాలనుకున్నాడు. ఊరేమైపోయినా ఫరవాలేదు, తన ప్రాబల్యం కోసం, తన పలుకుబడి కోసం నానా హంగామా చేశాడు.

తలతో నడుస్తానని డప్పు చాటించాడు.

జనమంతా పిచ్చివాణ్ణి చూసినట్టు చూసి, పొలాలకు వెళ్లిపొయ్యారు. ఎత్తిన మోటార్ సైకిల్ దించకుండా భుజాల మీద మోస్తూ, నెల రోజులు ప్రదక్షిణలు చేశాడు. జనం పట్టించుకోలేదు.

మైకు పెట్టి అరనిముషంలో అరవై పాటలు పాడాడు. తమను కదిలించని పాటకు జనం ఎందుకు కదిలి వస్తారు? చెవులు మూసుకుని మూగగా భరించారు.

మనిషికి వళ్లు మండిపోయింది.

ఏ ఆటా సాగడం లేదు. ఏ పాటా సాగడం లేదు. ఏం చెయ్యాలో తోచడం లేదు- మరో కొత్త పథకం వేశాడు.

ఊర్లోని అధికారులను, అనధికారులను, పెత్తందార్లను, నాయకులను, చిన్నలను, పెద్దలను అందరినీ బుట్టలో వేసుకుని, అన్ని రకాల ప్రజల డబ్బునూ కాజేశాడు. షేర్లన్నాడు. పెట్టుబడికి మూరు పేర్లన్నాడు. ఇప్పుడు రెండు వందలు పెడితే ఇరవై యేళ్ళకు మారుతీ కార్లన్నాడు. స్కీం స్కీం అన్నాడు. కొందరు దాన్నే స్కాం స్కాం అన్నారు. ఏమీ కాలేదు.

మనిషి ఆనందంగా డబ్బు భోంచేశాడు.

అయితే అతని ఆకలి ఎంతో కాలం నిలువలేదు. ప్రజలు తిరగ బడనూలేదు. నోరు లేని జీవాల్లా నష్టాన్ని భరించడానికి సిద్ధపడ్డారు. తలలాడించారు. రెక్కలు విరుచుకున్నారు. సౌభాగ్యం వారి చమటలో వుంది. గనుక, ఊరు అమ్ముడు పోలేదు. ఊరి పరువు పోలేదు. ఊరు నిశ్చలంగానే ఉంది. ఊరు నిబ్బరంగానే ఉంది.

పక్క ఊరి దళాలు ఊరి మీద పడి దోచుకోబోతున్నాయని, మనిషి భయపెట్టాడు. అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించాడు. బయటివారు ఎవరూ రాలేదు. రాత్రి వేళల్లో మనిషే పందికొక్కులా ఊరి కింద గోతులు తవ్వడం మొదలు పెట్టాడు.

చీకట్లో తెలియక, జనం మనిషి నడ్డి విరగొట్టారు. తెల్లవార గానే మనిషి తన గౌరవానికి భంగం కలగకుండా రాత్రి తనకు గుండె నొప్పి వచ్చిందన్నాడు. వైద్యుణ్ణి పిలిపించుకున్నాడు. 'తన శరీర ప్రవృత్తి విచిత్రమైందనీ, నడ్డి జబ్బుకు మందిస్తే, గుండె జబ్బు తగ్గుతుందనీ, చెప్పాడు. ఇదేదో మెంటల్ కేసులా వుందనుకుని, వైద్యుడు తగిన మందేదో ఇచ్చి వెళ్లాడు.

ఏమిటో ఊరంతా ఒక్కతాటి మీద నడవడం మనిషికి నచ్చ లేదు. వాళ్ళు నడిచే ఆ తాడేదో ఓ పట్టాన అంతు పట్టలేదు. అంతు పడితే, దాన్ని ముక్కలు చెయ్యాలన్నదే అతడి ధ్యేయం. ఊరంతా రూపాయిబిళ్ళ మీద నడుస్తోందేమోనని చూశాడు. నడుస్తోంది గాని, మొత్తానికి మొత్తంగా కాదు. ఊరంతా ఒక నీతి మీద నడుస్తోందేమో నని చూశాడు. నడుస్తోంది గాని మొత్తానికి మొత్తంగా కాదు....

జనాన్ని విడదీయాలి. ఎలా? మనిషికి రాత్రీ పగలూ అదే ధ్యాస అయిపోయింది- అదే ధ్యేయమై పోయింది.

మనిషి కొత్త పథకాలు వేశాడు.

ఊళ్లో సారా పోయించాడు. తాగినంత తాగి 'మాకు సారా పోయించి చెడగొడతావా?' అని జనం వెంటపడి తన్నారు.

ఇది బాగులేదనుకుని, 'మీ కులాలు వేరు. ఆర్థిక స్తోమతలు వేరు. మీలో నలుపు తెలుపు వేరు. మీలో పొట్టి పొడుగు వేరు. మీరంతా వేరు వేరు రా బాబు'- అని గొంతెత్తి ఉపన్యసించాడు.

అంతా విని 'నువ్వో చీడ పురుగువి. మా ప్రాణాలు తియ్యక, నువ్వే వేరుగా ఉండరా బాబు'- అని జనం మనిషిని వేరు పడేశారు. ఊరి బయట పాకలో ఉంచారు. 'ఛీ ఛీ! నన్నేమిటి. అంటరాని వాడిలా వుంచారూ?' అని మనిషి జుట్టు పీక్కున్నాడు.

మనిషి ఊరి బయట చెరువు కట్ట మీద కూచున్నాడు. తన ధ్యేయం పూర్తి కావటానికి దేవత లేమైనా 'హెల్పింగ్ హాండ్' ఇస్తా రేమోనని.... ఆలోచించాడు. తపస్సు చేద్దామనుకున్నాడు. ఘోరంగా ప్రారంభించాడు కూడా!

తపస్సు ప్రారంభించాడే గాని, ఏ దేవతను పిలవాలో, ఏ దేవుణ్ణి తలవాలో అర్థం కాలేదు. రామ్ అన్నాడు. రహీమ్ అన్నాడు.

నా తండ్రీ యెహోవా అన్నాడు. హుస్సేన్ సాగర్ తథాగతా అన్నాడు. వినాయక్‌సాగర్ వినాయకా - అన్నాడు. దేవుళ్ళకు సైతం చెరువునీళ్లు తాగించే మనిషి నైజం తెలుసు కాబోలు, ఎవ్వరూ పలకలేదు. కార్త్యవీరా, కనకలక్ష్మీ, మాంకాలమ్మా, నూకాలమ్మా, ఉప్పలమ్మా, ఊరిబొమ్మా - అన్నాడు. ఎవ్వరూ ఉలకలేదు. 'ఇప్పుడేం చెయ్యడం?' అని తల పట్టుకుని కళ్లు మూసుకుని కూర్చున్నాడు.

చాలాసేపు కళ్ళు మూసుకోవడం వల్ల, కన్నంటుకుంది- నిద్ర పట్టింది. నిద్రలో కల వచ్చింది. కలలో దేవతల పరేడ్ జరిగింది. ఒక్కొక్క దేవుడూ వచ్చి మనిషిని బెదిరించి పొయ్యారు. "వెంటనే తమకు గుడి కట్టించకపోతే, స్కామ్‌లో ఇరుక్కుని చచ్చుదువుగాక"- అని దేవుళ్ళు శపించారు. "పోలీసు కాల్పుల్లో రక్తపు చుక్కవై చిట్లి పోతావని" మరికొంత మంది బెదిరించారు. "సారా ఉద్యమ మహిళల పద ఘట్టనలో నలిగి ఛస్తావని"- ఓ దేవత తీవ్రంగా హెచ్చరించింది.

అన్ని గ్రూపుల దేవుళ్లూ ఒకే కోర్కె కోరారు. మనిషి కోరదామనుకున్నది ఎక్కడో అడుగంటి పోయింది. దేవతల కోర్కె ముఖ్యం గదా? మనిషి జడుసుకుని లేచి నిలబడ్డాడు. ఇక గుళ్ళు కట్టడం తథ్యమనుకున్నాడు. అన్ని గ్రూపుల వాళ్ళకూ వారి వారి ఆలయాలు కట్టడం ప్రారంభించాడు.

సందులు, గొందులు, వీధులు, సెంటర్లూ, చెరువు గట్టులూ అంతా గుళ్లే.... చర్చిలే.... మసీదులే.... సత్ సంగ్‌లే.... గురుద్వారాలే నట్టనడి రోడ్డుమీద ట్రాఫిక్ సిగ్నల్స్ పక్కన, హాస్పిటల్ ముందు, యూరినల్స్ వెనక, బస్సు డిపో లోపల, కాలనీల వెలుపల.... అంతా.... అంతా.... ఇంత ఖాళీ జాగా కనిపిస్తేచాలు, మనిషి దేవతల్ని ప్రతిష్ఠిస్తూనేఉన్నాడు.

ఊరు, ఊరంటే ఉట్టి ఊరు కాదు-
దేశానికి మినీ స్వరూపం!

మనిషి చలువవల్ల దేశమంతా అతి పవిత్ర స్థలమై పోయింది. బళ్ళు (పాఠశాల) దేశంగా ఎదగలేక గుళ్ళ దేశంగా మిగిలి పోయింది-

మనిషి ధ్యేయం నెరవేరింది.

ఒక్క మాటపై నడిచే జనమంతా చీలికలై, పీలికలై పొయ్యారు. ప్రజలు దేవుళ్ళ వారీగా చీలి పొయ్యారు. ఒకడి దేవుడు ఒకడికి పడకుండా తయారయ్యారు. ఎవడి దేవుడి గొప్పతనం వాడు డబ్బాకొట్టుకోవడం మొదలయ్యింది. మనిషిని మనిషిగా కాక, ఆ గ్రూపు దేవుడి ప్రతినిధిగా గుర్తించడం మొదలయ్యింది.

ఒకరి దేవుణ్ణి మరొకరు ఎత్తి పొడుచుకోవడం ... చివరకు దేవుడి పేరు మీద ఒకరినొకరు పొడుచుకోవడం కొనసాగింది.

నా పిట్ట గూడు నువ్వెందుకు తొక్కావ్? నీ పిట్టగూడు నేను తొక్కేస్తా. నా పుస్తకం నువ్వెందుకు చింపావ్? నీ పుస్తకం నేను చింపేస్తా.... అన్నట్టు బాలచేష్ట! బాలచేష్ట! మూర్ఖపు విజ్ఞుల అజ్ఞానానికి పరాకాష్ట!! ఒకడి గుడినొకడు పడగొట్టుకోవడం సాగుతూ వచ్చింది.

శివాలయం కూలి మసీదయ్యింది. మసీదు కూలి రామాలయ మైంది. చరిత్ర పుటలు వెనక్కి మళ్లాయి. కంప్యూటర్ యుగంలో మానవ పతనం అత్యున్నత స్థాయికి చేరి, మహోన్నతంగా భాసించింది!

దాని కంతటికీ కారణం- మనిషి!

మనిషిలో విభేదాలు, మనిషిలోని వైరుధ్యాలు, మషినిలోని ద్వేషాలు.

మనిషిలో ఇమడని మనిషి! మనిషిలో ఎదగని మనిషి!!

కర సేవలు, పాద సేవలు, అర్చనలు, భజనలు, ప్రేయర్లు, దుఃవా 'మాంగటాలు'. గుళ్లో- లేని దేవుణ్ణి నిలబెట్టడానికి లక్షన్నర ఉపాయాలు.

మనిషిఒళ్లో వున్న దేవుణ్ణి పడగొట్టడానికి కోటిన్నర పద్ధతులు-
మనిషి తనను తాను కుంచించుకునే యత్నాలు,
మనిషి తనను తాను వంచించుకునే యత్నాలు,
మనిషి తనను తాను కూలగొట్టుకునే యత్నాలు....

మనిషి జీవితంలో దేన్నో అన్వేషిస్తూ, దేనికోసమో బతుకుతూనే ఉన్నాడు.

○

మార్చ్ 1993